పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి। చిత్తూరు। వై.ఎస్.ఆర్. కడప

## కుష్టు సర్వేకు సహకరించాలి..



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 11**

కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా ఈ నెల 11 నుంచి 24వ తేదీ వరకు జిల్లాలో ఇంటింటి కుష్టు వ్యాధి సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా కుష్టు నిర్మూలన అధికారి డా. ఎం. శారదా బాయి. అంకిరెడ్డి. తెలిపారు.2027 మార్చి నాటికి కుష్టు వ్యాధిని నిర్మూలించాలనే లక్ష్యంతో ఆశా కార్యకర్తలు, పురుష వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అనుమానితులను గుర్తిస్తారని చెప్పారు. చర్మంపై స్పర్శలేని రాగిరంగు మచ్చలు, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం వంటి లక్షణాలను గుర్తించి సంబంధిత ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేస్తారన్నారు.వైద్య పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా బహుళ ఔషధ చికిత్స అందిస్తామని తెలిపారు. కుష్టు వ్యాధి నయం కానిది కాదని, ప్రారంభ దశలో గుర్తించి పూర్తిస్థాయిలో చికిత్స పొందితే వైకల్యాలను నివారించవచ్చున్నారు.కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా కుటుంబ సభ్యులు, సమాజం సహకరించాలని, సర్వేకు ప్రజలు పూర్తిగా సహకరించాలని డా. శారదా బాయి కోరారు. "కుష్టు వ్యాధిపై భయం వద్దు.. నిర్లక్ష్యం అసలే వద్దు.. అవగాహనతో వ్యాధిని నిర్మూలిద్దాం" అని ఆమె పిలుపునిచ్చారు.

# లోక్ అదాలత్‌తో కేసులకు సత్వర పరిష్కారం

### - పెండింగ్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునేందుకు సువర్ణావకాశం

### - క్రిమినల్, కుటుంబ, మ్యాట్రిమోనియల్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక అవకాశం



**శ్రీకాళహస్తి,పెన్ పవర్, సెప్టెంబరు11:**

శ్రీకాళహస్తి కోర్టు ఆవరణంలో ఈ నెల 12వ తేదీ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు కోర్టు చైర్మన్, 12వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా పోలీసు అధికారులు తమ పరిధిలోని కేసుల్లో కక్షిదారులను సంప్రదించి, లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకునే అవకాశం గురించి అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు, మ్యాట్రిమోనియల్ కేసులు, పెట్టీ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులు తదితర కేసులను ఇరుపక్షాల సమ్మతితో పరిష్కరించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.కేసుల పరిష్కారం కోసం దీర్ఘకాలం కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఇరుపక్షాలు రాజీ మార్గంలో సమస్యలను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఒక మంచి వేదికగా ఉపయోగపడుతుందని జడ్జి కృష్ణన్ కుట్టి తెలిపారు.పట్టణ ప్రజలు, న్యాయవాదులు, బీఎస్ఎన్ఎల్, పోలీస్ శాఖ, బ్యాంకులు తదితర సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలకు త్వరితగతిన న్యాయపరమైన పరిష్కారం పొందాలని సూచించారు.

## విద్యార్థులకు 'వినాయక వ్రత కల్పం2026' పుస్తకాల పంపిణీ

### - భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వ్రతాన్ని ఆచరించాలి ఉపాధ్యాయులు



**ఏర్పేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 11:**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పేడు మండలం మడిబాక గ్రామపంచాయతీ పరిధిలోని రాజులకండ్రిగ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు 'వినాయక వ్రత కల్పం2026' పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. సీనియర్ జర్నలిస్ట్ సుకుమార్ తమ్ముడు పరమానంద్, గుండ్రాజు మురళి రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు బి. శుభాషిణి మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో వినాయక చవితి పూజకు ఎంతో విశిష్టమైన ప్రాధాన్యత ఉందన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే మన సంప్రదాయాలు, ఆచారాలను తెలుసుకోవడం అభినందనీయమన్నారు.కె. అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో భక్తులు వినాయక వ్రత పూజా విధానాన్ని సులభంగా అర్థం చేసుకొని, భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించాలనే ఉద్దేశంతోనే పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.ఎస్. తేజోకుమారి మాట్లాడుతూ విద్యార్థులు వినాయకుడి సన్నిధిలో పుస్తకాలను ఉంచి, విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. విద్యాభ్యాసంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు క్రమశిక్షణతో పాటు దైవభక్తిని కూడా పెంపొందించుకోవాలని సూచించారు.అనంతరం పాపానాయుడుపేటలోని బాపూజీ విద్యాసంస్థల డైరెక్టర్ వేమూరి అనిల్ కుమార్ చేతుల మీదుగా 'వినాయక వ్రత కల్పం2026' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పూజా విధానాన్ని సులభంగా వివరించే పుస్తకాలు, పత్రాలను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఐల సేవలు టీడీపీ విజయానికి వెన్నెముక

### - సాధారణ కార్యకర్తలే పార్టీకి అసలైన బలం: నారా లోకేష్

### - లోకేష్ నాయకత్వంలో నవ్యాంధ్ర నిర్మాణంలో భాగస్వాములవుతాం: జహీర్ అహ్మద్ షేక్



ఎన్ఆర్ఐ టీడీపీ ఖతార్ నాయకులు, శ్రీకాళహస్తి మైనార్టీ నేత జహీర్ అహ్మద్ షేక్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 11:**

తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో విద్యా, ఐటీ, సమాచార శాఖల మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను

అధికారంలోకి రావడంలో ఎన్ఆర్ఐల కృషి ఎంతో కీలకమని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు ఉన్నారని, అందరూ సమిష్టిగా పనిచేయడం వల్లే చారిత్రాత్మక విజయం సాధ్యమైందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ జెండాను భుజాన మోస్తూ రాత్రింబవళ్లు శ్రమించే సాధారణ కార్యకర్తలే టీడీపీకి అసలైన బలమని, వారి కష్టాన్ని ఎప్పటికీ విస్మరించబోమని స్పష్టం చేశారు.

టీడీపీ కార్యకర్తలకు బలమైన మార్గదర్శిగా నిలుస్తూ, భవిష్యత్ తరాలకు భరోసా కల్పిస్తూ నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తున్న నారా లోకేష్ నాయకత్వం స్ఫూర్తిదాయకమని జహీర్ అహ్మద్ షేక్ కొనియాడారు. దార్శనికత కలిగిన లోకేష్ వంటి నాయకుడి నాయకత్వంలో పనిచేయడం తమకు దక్కిన గొప్ప అదృష్టమని పేర్కొన్నారు.ఎన్ఆర్ఐల సహకారం.. కార్యకర్తల అంకితభావం.. నాయకత్వ దిశానిర్దేశం ఈ మూడు శక్తులతో టీడీపీ మరింత బలోపేతం కావడం ఖాయమని జహీర్ అహ్మద్ షేక్ అన్నారు.

# మిమిక్రీతో అలరించిన

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బాలసుబ్రమణ్యం

## అక్షర జూనియర్ కళాశాలలో ఘన సన్మానం



**తొట్టంబేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 11:**

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్ ఉపాధ్యాయులు కయ్యూరు బాలసుబ్రమణ్యంను నాగాలాపురం అక్షర జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యం తనదైన మిమిక్రీ ప్రదర్శనతో విద్యార్థులను విశేషంగా అలరించారు. వివిధ రకాల శబ్దాలతో పాటు సినీ తారల గొంతులను అనుకరిస్తూ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఆయన మిమిక్రీ ప్రదర్శనకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది.అనంతరం కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థుల ఆధ్వర్యంలో బాలసుబ్రమణ్యంను ఘనంగా సత్కరించి అభినందించారు. విద్యారంగంలో ఆయన చేస్తున్న సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ప్రేమ్ కుమార్, ఆర్ఐఓ గోపాల్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ ఎన్నికలకు అధికారుల అప్రమత్తత

### - పోలింగ్ కేంద్రాల పరిశీలన.. అన్ని సదుపాయాలతో సిద్ధం చేయాలని ఆదేశాలు



తొట్టంబేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 11:

రాష్ట్రంలో ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తూ మౌలిక సదుపాయాల పరిస్థితిని సమీక్షిస్తున్నారు.ఈ నేపథ్యంలో తొట్టంబేడు మండలం చిట్టత్తూరు పంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో సురేంద్రనాథ్ చిట్టత్తూరు గ్రామ అభివృద్ధి అధికారి శాంతితో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, ఓటర్లకు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులతో వివరాలు తెలుసుకున్నారు.రానున్న ఎంపీటీసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ముందుగానే అన్ని సదుపాయాలతో సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఎంపీడీవో ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. దీంతో ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో తొట్టంబేడు మండలంలో అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను వేగవంతం చేసింది.

# సెయింట్ జేవియర్స్‌లో ఘనంగా హిందీ భాషా దినోత్సవం

### - హిందీ భాష ప్రాధాన్యతను వివరించిన పండితులు.. ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు




**శ్రీకాళహస్తి,పెన్ పవర్,సెప్టెంబర్ 11:**

ఎల్ఐసీ కాలనీ సమీపంలోని సెయింట్ జేవియర్స్ పాఠశాలలో హిందీ భాషా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 14వ తేదీన నిర్వహించాల్సిన హిందీ భాషా దినోత్సవాన్ని ముందస్తుగా శుక్రవారం నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది.

ఈ సందర్భంగా హిందీ భాషా పండితులు హిందీ భాష ప్రాముఖ్యత, ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు హిందీలో కవితలు, గేయాలు, పద్యాలు, పదాలకు అర్థాలు చెప్పడంతో పాటు నాటకాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. విద్యార్థుల ప్రతిభను ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

**మూడు భాషల్లో ప్రావీణ్యం అవసరం**

పాఠశాల ప్రధానోపాధ్యాయిని సిస్టర్ షేర్లి మాట్లాడుతూ.. విద్యార్థులు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో మంచి ప్రావీణ్యం సాధించాలని సూచించారు. భాషా పరిజ్ఞానం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంతో పాటు భవిష్యత్ విద్యా, ఉద్యోగ అవకాశాలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అన్ని భాషలను గౌరవిస్తూ వాటిపై పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, హిందీ భాషపై చేసిన ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చివరగా జాతీయ గీతాలాపనతో హిందీ భాషా దినోత్సవ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

# విద్యార్థుల అభ్యసనానికి అండగా టీడీపీ

### - సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌కు స్టాండింగ్ బ్లాక్ బోర్డు వితరణ

### - టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 11:**

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపు మేరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే సంకల్పంతో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని టీడీపీ శ్రీకాళహస్తి పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్ అన్నారు.శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ సూచనల మేరకు శుక్రవారం కాసరం రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌కు నూతన స్టాండింగ్ బ్లాక్ బోర్డును వితరణగా అందజేశారు. విద్యార్థినుల అభ్యసన ప్రక్రియకు బోర్డు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.విద్యార్థులే రాష్ట్ర భవిష్యత్‌కు బలమైన పునాదులని, వారి విద్యాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని రమేష్ పేర్కొన్నారు. విద్యారంగ అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. అదే విధంగా ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో విద్యాభివృద్ధి, విద్యార్థుల సంక్షేమానికి తమవంతు సహకారం అందిస్తున్నారని కొనియాడారు.ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగుపడితేనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని, సమాజంలోని ప్రతి ఒక్కరూ విద్యాసంస్థల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రీకాళహస్తి పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, సీనియర్ నాయకులు డిల్లీ బాబు, కోలా సుబ్రహ్మణ్యం, కోరా రాకేష్, మహేష్, శ్రీనివాసులు, హాస్టల్ వార్డన్ మంజుల తదితరులు పాల్గొన్నారు.




## ప్రయాణికుల ఆటోను ఢీకొట్టిన పాల ట్యాంకర్ ఒకరి మృతి - మరి కొందరికి తీవ్ర గాయాలు

**నాయుడుపేట( ఓజిలి ) పెన్ పవర్, సెప్టెంబర్ 11**



10మందితో ప్రయాణిస్తు పండ్లూరు క్రాస్ రోడ్డు పక్కన ఆగి ఉన్న ఓ పాసెంజర్ ఆటోను పాలలారీ టాంకర్ ఢీకొనడంతో అక్కడికక్కడే ఒకరు మృతి, చెందగా మరో కొంతమందికి

తీవ్ర గాయాలు అయిన సంఘటన చోటుచేసుకుంది.శుక్రవారం పోలీసుల వివరాల మేరకు విజయవాడ నుండి పలమనేరు వెళుతున్న మోడల్ సమస్త కు చెందిన ఏపీ 16టీజీ 3277 గల పాల వాహనం లారీ పండ్లూరు క్రాస్ రోడ్స్ సమీపంలోని కిన్నెర నేషనల్ జాతీయ రహదారి 16 హోటల్ వద్ద పదిమంది కూలీలతో ఆగి ఉన్న ఆటోను వెనక నుండి పాల లారీ బలంగా ఢీకొనడంతో జరిగిన సంఘటన స్థలంలోని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన వారికి తీవ్ర గాయాలు కాక ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలు ఓజీల మండలం పార్లపల్లి గ్రామానికి చెందిన వారిగా స్థానికులు చెబుతున్నారు..నిత్యం ఏదో ఒక కూలి పనులకు బతుకు జీవనం కోసం అందరితో కలిసి వెళ్లడంతో,ఒక్కసారిగా ప్రమాదం జరగడంతో వారికి గ్రామంలో విషాదఛాయలు చోటుచేసుకున్నాయి.. దగ్గరలో ఉన్న ఓజిలి ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొని, గాయాలు పాలైన మిగతా వ్యక్తులను నేషనల్ జాతీయ రహదారికి సంబంధించిన 1033 హైవే అంబులెన్స్ ద్వారా నాయుడుపేటకు ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించి ఇచ్చారు అందిస్తున్నారు..అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# మట్టి వినాయకుల పంపిణీ చేసిన గోళ్ళ రాజేష్



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 11**

వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో 3,000 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు కల్పనా సెంటర్‌లోని టెక్కె మార్కెట్ యార్డులో గోళ్ళ రాజేష్‌కు చెందిన షాపు వద్ద ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులను పూజించి పర్యావరణం, నీటి వనరులను పరిరక్షించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలను పాటిస్తూ భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించాలని కోరారు.

గోళ్ళ రాజేష్ గత రెండేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు ఆర్థిక సహాయ సహకారాలు అందించడంతో పాటు దేవాలయాలు, మసీదులు, చర్చిల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి వడ్డీలేని రుణాలు అందిస్తూ వ్యాపారాభివృద్ధికి తోడ్పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో 3,000 మట్టి విగ్రహాల ఉచిత పంపిణీకి శ్రీకారం చుట్టడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- పోషణ్ మా2026లో భాగంగా అవగాహన కార్యక్రమం
- వివిధ ఆహార వర్గాలను సమతుల్యంగా తీసుకోవాలి: సీడీపీవో శాంతి దుర్గ





**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 11:**

పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారం ఎంతో అవసరమని శ్రీకాళహస్తి ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీవో శాంతి దుర్గ అన్నారు. పోషణ్ మా2026 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధి అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు పోషణ్ మా2026 కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీడీపీవో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల పోషకాహారం, అంగన్‌వాడీ కేంద్రాల్లో వేడిగా వండిన భోజనం, సమాజ భాగస్వామ్యం, బాధ్యతాయుత పోషణ, ప్రాథమిక విద్య, బాలల వికాసం, మాతృ సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పోషకాహార లోపాలు, వాటి కారణాలు, నివారణ చర్యలపై తల్లులు, చిన్నారులు, ప్రజలకు వివరించారు. వివిధ ఆహార వర్గాలకు చెందిన పదార్థాలను సమతుల్యంగా తీసుకోవడం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపాలను నివారించడంతో పాటు శారీరక, మానసిక ఎదుగుదలను మెరుగుపరచవచ్చని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం, విద్య, సమగ్ర వికాసానికి తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది, సమాజం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ముత్యాలమ్మ గుడి వీధి అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

# అక్రమ రవాణాకు సిద్ధమైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం


- రూ.2 లక్షల విలువైన 400 కిలోల ఎర్రచందనం పట్టివేత
- 40 దుంగలను స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 11:**

అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన ఎర్రచందనం దుంగలను అటవీశాఖ అధికారులు చాకచక్యంగా స్వాధీనం చేసుకున్నారు. రహస్య సమాచారం మేరకు అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టి మొత్తం 40 ఎర్రచందనం దుంగలను పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న దుంగల బరువు సుమారు 400 కిలోలు ఉండగా, వాటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని అటవీశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. రహస్య సమాచారం అందిన వెంటనే అటవీశాఖ సిబ్బంది రంగంలోకి దిగి వేగంగా గాలింపు చేపట్టడంతో అక్రమ రవాణాదారుల ప్రయత్నానికి అడ్డుకట్ట పడింది. దుంగలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన అధికారులు, వాటిని అక్కడికి ఎవరు తీసుకొచ్చారు? అక్రమ రవాణా వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. అక్రమ ఎర్రచందనం రవాణాకు పాల్పడుతున్న వారిని గుర్తించి, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ ఆర్ ఓ లోకేష్, ఎఫ్ ఎస్ ఓ ఉష, ఎం బీ ఓ సురేష్, ఎం బి ఓ రమేష్, ఎం బీ ఓ హరి, తదితరులు పాల్గొని ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రహస్య సమాచారంపై తక్షణమే స్పందించి భారీగా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంపై అటవీశాఖ చర్యలను స్థానికులు అభినందిస్తున్నారు.

# ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపించడమే ప్రజాప్రతినిధిగా నా ప్రధాన బాధ్యత.



**కోవూరు పెన్ పవర్ సెప్టెంబర్ 11.**

ఈ రోజు శుక్రవారం వీపీఆర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలను కలిసి వారి సమస్యలను స్వయంగా విన్నాను. వ్యక్తిగత సమస్యలతో పాటు గ్రామాలు, ప్రాంతాలకు సంబంధించిన పలు అంశాలను నా దృష్టికి తీసుకువచ్చారు.

ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించాను. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను

# సైనికుల్లా పోరాడదాం... స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగురేద్దాం...

## మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 11**

- కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై రగిలిపోతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి...
- నంద్యాల... స్థానిక సమరానికి సిద్ధమైన వైసీపీ!
- ఎన్నికల హామీలను గాలికొదిలేసి, రాష్ట్రాన్ని కరువులోకి నెట్టడమే కూటమి ప్రభుత్వ అసలు సిసలు పాలనా

నంద్యాల గడ్డపై మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి గర్జించిన తీరు చూస్తే ఇదే ప్రశ్న ప్రతి ఒక్కరి గుండెల్లో మెదులుతుంది. నంద్యాల చాబోలు రోడ్డులోని ఏఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్ వేదికగా జరిగిన వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం కేవలం ఒక రాజకీయ సమావేశం కాదు... అధికార కూటమి ప్రభుత్వ మోసాలపై ఉవ్వెత్తున ఎగసిపడ్డ ఆగ్రహజ్వాల! కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్సీపీ సీఈసీ సభ్యుడు పీపీ నాగిరెడ్డి, వైసీపీ డోన్ నియోజకవర్గ పరిశీలకుడు పీపీ మధుసూధన్ రెడ్డి హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి సమావేశంలో మాట్లాడుతూ....అధికారంలోకి వచ్చి కోటలు కడతామన్నారు... నేడు ప్రజలను కన్నీళ్లలో ముంచేశారు! ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన చంద్రబాబు అండ్ కో, నేడు అధికారంలోకి వచ్చాక ఆ పథకాలన్నింటినీ అటకెక్కించారు. రాష్ట్రంలో వర్షాలు కురక కరువు తాండవిస్తుంటే, కనీసం తాగు, సాగునీరు కూడా ఇవ్వలేని అసమర్థ స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని విమర్శించారు. రైతన్నలు రోడ్డెక్కి పోరాటం చేస్తే తప్ప నీళ్లు విడుదల చేయని ఈ ప్రభుత్వ నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. అభివృద్ధిని గాలికొదిలేసి, కేవలం సంపద సృష్టించే పేరుతో ప్రజలను దోచుకోవడమే నేటి పాలకుల ఏకైక అజెండాగా మారిందని ఆరోపించారు. డిఎస్సీలో స్పోర్ట్స్ కోటా నియామకాల మోసాలపై ప్రశ్నిస్తే నోరు మెదపని ఈ ప్రభుత్వానికి ప్రజలే త్వరలో తగిన బుద్ధి చెబుతారన్నారు.

**కార్యకర్తలే పార్టీకి ఊపిరి... భయపడే ప్రసక్తే లేదు!**

శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు కార్యకర్తలే పార్టీకి బలమని, కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం దక్కుతుందని భరోసానిచ్చారు. పోలీసుల పేరుతో, అధికారుల పేరుతో వైసీపీ శ్రేణులను భయపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదు. ఓవరాక్షన్ చేస్తున్న ప్రతి ఒక్కరి పేర్లూ రాసి పెట్టుకోండి... భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

**సైనికుల్లా కదిలిపోదాం... స్థానిక సంస్థల పీఠం కైవసం చేసుకుందాం!**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా, ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ఒక సైనికుడిగా రణరంగంలోకి దూకాలని, ఇంటింటికీ, ప్రతి గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను, వైఫల్యాలను ఎండగట్టాలని ఆదేశించారు. నంద్యాల గడ్డపై వైఎస్సార్‌సీపీ జెండాను రెపరెపలాడించే వరకు నిద్రపోయేది లేదని. విజయం మనదే... సమర శంఖం పూరించండని వైసీపీ శ్రేణులకు పిలుపు నిచ్చారు! . వైసిపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సాయినాథ్ రెడ్డి,పిపి మధుసూదన్ రెడ్డి శ్రీశైలం నియోజకవర్గం పరిశీలకుడు, నంద్యాల నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీ రత్నబాబు చౌదరి, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ శశికళ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు పురుషోత్తం రెడ్డి విజయ శేఖర్ రెడ్డి, మహేశ్వర రెడ్డి, నంద్యాల, గోస్పాడు ఎంపీపీలు శెట్టి ప్రభాకర్, ఆర్థర్ సైమన్, వైసీపీ ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, నంది రైతు సమైక్య అధ్యక్షుడు రామ సుబ్బారెడ్డి, , జిల్లా వైసీపీ మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు కారు రవికుమార్, జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, వైసీపీ జిల్లా మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ, జిల్లా వైసీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు టి.వి రమణ, వైసీపీ రాష్ట్ర ర్ సెల్ జనరల్ సెక్రటరీ శంకర్ నాయక్, వైసిపి రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి ఆంజనేయులు, వైసీపీ మండల అధ్యక్షులు బసవేశ్వర రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకుడు ప్రహల్లాద రెడ్డి, వైసీపీ జిల్లా సెక్రటరీ దేవానగర్ బాషా, మాజీ కౌన్సిలర్ లు, సర్పంచ్ లు, ఎంపిటిసి లు, వార్డు ఇంచార్జ్ లు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# 5 రోజుల బ్యాంకింగ్ న్యాయమైన (పి.ఎల్.ఐ) కోసం దేశవ్యాప్త బ్యాంకు సమ్మె

- నంద్యాలలో బ్యాంకు ఉద్యోగులు, అధికారుల ఐక్య గళం









**నంద్యాల, ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 11**

యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యు.ఎఫ్.బి.యు ) పిలుపు మేరకు 5 రోజుల బ్యాంకింగ్ విధానం అమలు మరియు న్యాయమైన, సముచితమైన పెర్ఫార్మన్స్ లింకేడ్ ఇన్సెంటివ్ ( పి. ఎల్.ఐ) సాధన కోసం దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు చేపట్టిన అఖిల భారత బ్యాంకు సమ్మెకు నంద్యాల ప్రాంతంలో విశేష స్పందన లభించింది.

బ్యాంకింగ్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు దేశ ఆర్థికాభివృద్ధికి నిరంతరం సేవలందిస్తూ, ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నారు. మారుతున్న పని పరిస్థితులకు అనుగుణంగా వారానికి ఐదు రోజుల పని దినాలు, శనిఆది వారాంతపు సెలవులతో 5 రోజుల బ్యాంకింగ్ విధానాన్ని అమలు చేయాలని బ్యాంకు ఉద్యోగులు, అధికారులు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు.

అదేవిధంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారుల కృషి, బాధ్యతలు మరియు పనితీరుకు తగిన గుర్తింపు లభించే విధంగా న్యాయమైన, పారదర్శకమైన మరియు సముచితమైన పి.ఎల్.ఐ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

నంద్యాలలో అన్ని బ్యాంకుల ప్రతినిధుల ఐక్య భాగస్వామ్యం

ఈ సమ్మె కార్యక్రమంలో నంద్యాల ప్రాంతానికి చెందిన వివిధ బ్యాంకుల ఉద్యోగులు, అధికారులు మరియు యూనియన్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటారు.

ఎస్.బి.ఐ నంద్యాల ప్రాంతం నుండి:
కామ్రేడ్ టీ . వెంకటేశ్వర్లు రీజినల్ సెక్రటరీ
కామ్రేడ్ పి . కిరణ్ మూర్తి ఆర్గనైజింగ్ సెక్రటరీ
కామ్రేడ్ సూర్య ఆఫీసర్స్ అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ
యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా నుండి:
కామ్రేడ్ సుకుమార్ రీజినల్ సెక్రటరీ
కామ్రేడ్ రాఘవ ఆఫీసర్స్ అసోసియేషన్
కెనరా బ్యాంకు నుండి:
కామ్రేడ్ చిన్న కంబగిరి
కామ్రేడ్ సాహిత్య మేడం
ఏపీజీబీ నుండి:
కామ్రేడ్ రవి తేజ రీజినల్ సెక్రటరీ
కామ్రేడ్ హరీష్ ట్రెజరర్
కామ్రేడ్ రాఘవేంద్ర సెంట్రల్ కమిటీ సభ్యులు

పై నాయకులు మరియు ప్రతినిధులు సమ్మె కార్యక్రమంలో పాల్గొని 5 రోజుల బ్యాంకింగ్ మరియు న్యాయమైన పి.ఎల్.ఐ డిమాండ్లకు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

వివిధ బ్యాంకుల ఉద్యోగులు, అధికారులు ఒకే వేదికపైకి వచ్చి బ్యాంకింగ్ ఉద్యోగుల హక్కులు, సంక్షేమం మరియు గౌరవప్రదమైన పనిజీవిత సమతుల్యత కోసం ఐక్యంగా పోరాడుతున్నామని స్పష్టం చేశారు.

మా నినాదం
5 రోజుల బ్యాంకింగ్ మా న్యాయమైన హక్కు!
ఫెయిర్ పి.ఎల్.ఐ మా న్యాయమైన డిమాండ్!
బ్యాంకు ఉద్యోగుల ఐక్యత మా అజేయ శక్తి!
ఐక్య పోరాటం విజయానికి మార్గం!
"ఐక్యంగా పోరాడుదాం న్యాయమైన హక్కులను సాధించుకుందాం."

# ఆత్మకూరులో ఘనంగా మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

## - 22 పాఠశాలల నుంచి విద్యార్థుల హాజరు విజేతలకు బహుమతులు



**ఆత్మకూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 11.**

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు మూఢనమ్మకాలు, ఛాందస భావాలను నిర్మూలించేందుకు జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మకూరు మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఆత్మకూరు మండలంలోని ఎల్.ఆర్.పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పాఠశాల స్థాయిలో విజేతలుగా నిలిచిన 8, 9, 10వ తరగతుల విద్యార్థులు హాజరయ్యారు. ఆగస్టు 27న నిర్వహించిన పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో మండలంలోని 22 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 1,400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయి పోటీ ప్రారంభంలో ఎల్.ఆర్.పల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కావాటి సురేష్ ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన సభా కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అసోసియేట్ సభ్యులు వంటేరు మల్లికార్జునరావు, ఆత్మకూరు మండల ప్రధాన కార్యదర్శి సుంకు మురళీకృష్ణ, రిటైర్డ్ డైట్ ఉపన్యాసకులు, జేవీవీ సీనియర్ నాయకులు కె. సుధాకర్ రావు, జేవీవీ సీనియర్ నాయకులు ఎస్కే సంధాని, బడుగు శ్రీనివాసులు, సాధిక్ హుస్సేన్, ఎండి మహమ్మద్, పార్లపల్లి సుధాకర్ రావు, యూటీఎఫ్ నాయకులు బి. శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు విద్యార్థులకు సైన్స్ ప్రాముఖ్యత, శాస్త్రీయ ఆలోచనా విధానం, మూఢవిశ్వాసాల నిర్మూలన, ప్రకృతిపర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావం, సమాజంలో సంస్థ చేపడుతున్న వివిధ ప్రజోపయోగ కార్యక్రమాలను వివరించారు.

<u>విజేతలు వీరే</u>

మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎస్కే హబీబా సుల్తానా, కె. జశ్విత, ఎం. తేజశ్రీ విజేతలుగా నిలిచారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో శ్రీమన్నారాయణ ఈఎం ఉన్నత పాఠశాల విద్యార్థులు లాస్యశ్రీ, సుష్మజ, రమ్యశ్రీ విజయం సాధించారు. విజేతలైన ఆరుగురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వీరు ఈ నెల 27న నిర్వహించనున్న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఆత్మకూరు మండలం తరఫున పాల్గొననున్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో చెర్లో ఎడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మహిమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిలిచాయి. ప్రైవేటు పాఠశాలల విభాగంలో ప్రగతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, నలంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వారికి కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ఆత్మకూరు మండల కార్యవర్గ సభ్యులతో పాటు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# పెద్ద కొదమగుండ్ల లైన్మెన్ గోపాల్ ఆకస్మిక మృతి





**పెన్ పవర్ కారంపూడి సెప్టెంబర్ 12 :---**
దుర్గికి చెందిన విద్యుత్ శాఖ లైన్మెన్ గోపాల్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా గుండె పోటు తో మృతి చెందాడు. 2004లో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఆయన ప్రస్తుతం కారంపూడి మండలం పెద్ద కొదమగుండ్ల గ్రామంలో విధులు నిర్వహిస్తున్నారు.గ్రామం లో మూడు సంవత్సరాల నుండి గ్రామంలో సేవలందిస్తున్నారు.విధి నిర్వహణలో అందరి ఆదరాభిమానాలు పొందారు. మాచర్ల డీఈ సింగయ్య, ఏడీఈ ఆనందరావు భౌతికకాయానికి నివాళులర్పించి, అంత్యక్రియల ఖర్చుల కోసం కుటుంబానికి రూ.25 వేలు సాయం అందజేశారు. మృతి చెందిన లైన్మెన్ గోపాల్ కుటుంబానికి విద్యుత్ శాఖ వారు అండగా ఉంటామంటూ కుటుంబానికి భరోసా కల్పించారు. లైన్మెన్ గోపాల్ కుటుంబంలో ఒకరికి విద్యుత్ శాఖలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. యూనియన్ నాయకులు, సభ్యులు నివాళులర్పించారు.

# హిందీ భాషా దినోత్సవ వేడుకల్లో వేటపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థుల సందడి

- దేశభక్తి గీతాలు, నృత్యాలు, స్కిట్లతో ఆకట్టుకున్న విద్యార్థులు
- బెస్ట్ మ్యూజిక్ టీచర్ ఎం.సునీతకు ఘన సత్కారం



**వేటపాలెం, సెప్టెంబర్ 11, (పెన్ పవర్) :**
వేటపాలెం జడ్పీ హైస్కూల్లో శుక్రవారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ సరోజిని రిబ్బన్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ పటాలను ప్రదర్శించారు.జాతీయ సమైక్యత, దేశభక్తిని ప్రతిబింబించే హిందీ నృత్యాలు, పాటలు, స్కిట్లు, హిందీ భాష అభివృద్ధికి కృషి చేసిన మహనీయుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హిందీ భాష ప్రాధాన్యత, జాతీయ సమైక్యతలో దాని పాత్రను ఉపాధ్యాయినీలు పద్మ, హితవచనం విద్యార్థులకు వివరించారు.
ఇటీవల జిల్లా స్థాయిలో బెస్ట్ మ్యూజిక్ టీచర్గా అవార్డు పొందిన ఎం. సునీతను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

# విద్యార్థుల చేతుల్లో పర్యావరణహిత వినాయకులు

- పందిళ్ళపల్లి జడ్పీ హైస్కూల్లో వినూత్న కార్యక్రమం
- మట్టి వినాయకుల తయారీపై విద్యార్థులకు అవగాహన



**పందిళ్ళపల్లి, సెప్టెంబర్ 11, (పెన్ పవర్) :**
వినాయక చవితిని పురస్కరించుకుని పందిళ్ళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయించారు. సైన్స్ ఉపాధ్యాయులు శ్రీమతి ఎన్. రూపకళ, సీహెచ్. భవానీదేవి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ప్లాస్టిక్, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వంటి పర్యావరణంలో సులభంగా కరగని పదార్థాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో మట్టి వినాయకులను తయారు చేయించి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.విద్యార్థులు తయారు చేసిన మట్టి వినాయకులను ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి తలమల దీప్తి, ఉపాధ్యాయులు పరిశీలించి అభినందించారు. అనంతరం విద్యార్థులందరితో ప్రకృతి ప్రార్థన చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీపీఎస్సీని జగన్.. అవినీతి పర్సంటేజ్ కమిషన్ గా మార్చాడు : ప్రత్తిపాటి

- ఏపీపీఎస్సీ అక్రమాలపై సిట్ నివేదికలు..
  హైకోర్టు తీర్పులపై జగన్ మౌనం ఉద్దేశపూర్వకమా..లేక అర్థాంగీకారమా? : ప్రత్తిపాటి
- ఎలాంటి అర్హతలు లేని రెండు ప్రైవేట్ ఏజెన్సీలకు వాల్యూయేషన్ బాధ్యతలు
  అప్పగించినా నాడు జగన్ నోరెత్తలేదు : ప్రత్తిపాటి



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 11 :**
కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించిన మెగా డీఎస్సీపై అదేపనిగా బురదజల్లుతున్న జగన్.. తన హాయాంలో జరిగిన ఏపీపీఎస్సీ అక్రమాలపై ఎందుకు నోరెత్తడం లేదు? ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను జగన్.. అవినీతి పర్సంటేజ్ కమిషన్ సర్వీస్ గా మార్చాడు. ఏపీపీఎస్సీ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన డిజిటల్ వాల్యూయేషన్ పై జగన్ ఎందుకు స్పందించడం లేదు? ఎలాంటి అర్హతలు లేని రెండు ప్రైవేట్ ఏజెన్సీలకు వాల్యూయేషన్ బాధ్యతలు అప్పగించిన అధికారులపై నాడు ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న జగన్ ఎందుకు చర్యలు తీసుకోలేదు? ప్రశ్నపత్రాల మూల్యాంకనానికి ఎంపిక చేసిన 450కి పైగా ప్రొఫెసర్లను కాదని, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, సెక్యూరిటీ గార్డులు, క్లర్క్ లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో గ్రూప్-1 పత్రాల మూల్యాంకనం చేయించడం ఎంత తప్పో జగన్ కు తెలియదా? ఏపీపీఎస్సీ పరీక్ష పత్రాలను స్ట్రాంగ్ రూముల నుంచి హాయ్ ల్యాండ్ కు తరలించి ఏకంగా 82 రోజుల పాటు మూల్యాంకనం చేయడంలో తన ప్రమేయం లేదని జగన్ చెప్పగలడా? ఒకటీ.. రెండూ కాదు.. 48వేల ఓఎమ్ఆర్ షీట్లు పునర్ ముద్రించడం అనేది తప్పుడు పని కాదా? ఏపీపీఎస్సీ అక్రమాలపై సిట్ నివేదికలు, హైకోర్టు తీర్పులపై జగన్ మౌనం.. ఉద్దేశపూర్వకమా లేక అర్థాంగీకారమా? వైసీపీ ప్రభుత్వంలో ఏపీపీఎస్సీ ఛైర్మన్ సహా, ఇతర సభ్యులందరూ ఆనాడు అడ్డగోలుగా అనైతిక చర్యలకు పాల్పడ్డారు. ఒక్కొక్కరు లక్షల జీతాలు తీసుకుంటూ కూడా, భత్యాల కోసం తప్పుడు బిల్లులు పెట్టి, ప్రభుత్వ సొమ్మును దిగమింగినా ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? తన కమీషన్లు తనకు ముట్టచెబుతున్నారనే జగన్.. వారిని చూసీచూడనట్టు వదిలేశాడు. ఏపీపీఎస్సీ అక్రమాలను కప్పిపుచ్చే క్రమంలో నాడు గౌతమ్ సవాంగ్ ఏకంగా అబద్దాలతో న్యాయస్థానాన్నే తప్పుదోవ పట్టించారు. ఈ అంశాలేవీ తమకు తెలియవన్నట్టు.. తమకేమీ సంబంధం లేదన్నట్టు జగన్, వైసీపీనేతలు సిగ్గులేకుండా కూటమి ప్రభుత్వంపై నిందలేస్తున్నారు. అత్యంత నిబద్ధత, నిజాయితీలతో 16,400 ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ లపై బురదజల్లుతున్నారు. తన పాలనలో జరిగిన ఏపీపీఎస్సీ అక్రమాలపై స్పందించలేని అసమర్థుడు.. ఏ ముఖం పెట్టుకొని మెగా డీఎస్సీని తప్పుపడుతున్నాడు. " అని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం ఒక ప్రకటనలో నిలదీశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రజల మధ్యే ప్రజాప్రతినిధి.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం
- పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్

**పెన్ పవర్ కృష్ణాజిల్లా పెనమలూరు సెప్టెంబర్ 11:**
ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజల మధ్యే ఉండాలన్నదే తెలుగుదేశం పార్టీ విధానమని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు.తాడిగడప మున్సిపాలిటీ పోరంకిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా దర్బార్లో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి సమస్యలతో వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి వినతిపత్రాలను స్వీకరించారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాప్రతినిధులు ప్రజలకు దూరంగా ఉండే పరిస్థితి లేదన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలనే సంస్కృతిని పార్టీ ఆవిర్భావం నుంచే కొనసాగిస్తోందని తెలిపారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు ప్రజాప్రతినిధులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజలకు, పాత్రికేయులకు అందుబాటులో ఉండే విధానానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. అనంతరం చంద్రబాబు నాయుడు 'ప్రజల వద్దకు పాలన', 'జన్మభూమి' వంటి కార్యక్రమాల ద్వారా పాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లారని వివరించారు.
ప్రతి శుక్రవారం పార్టీ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించాలని చంద్రబాబు నాయుడు ఆదేశించారని, అయితే పెనమలూరు నియోజకవర్గంలో ఒక్క శుక్రవారానికే పరిమితం కాకుండా ప్రతిరోజూ ప్రజల సమస్యల పరిష్కారానికి కార్యాలయం అందుబాటులో ఉంటుందని బోడే ప్రసాద్ స్పష్టం చేశారు.ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు లేదా సాయంత్రం 4 గంటలకు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని తెలిపారు. గ్రామాల్లో పర్యటనలు, ఇతర కార్యక్రమాలు ఉన్న సందర్భాల్లో ముందుగానే వాట్సాప్ సమూహాలు, సామాజిక మాధ్యమాల ద్వారా సమయాన్ని తెలియజేస్తున్నామని చెప్పారు.ప్రజా సమస్యల పరిష్కార వేదికకు చిట్ఫండ్ సంస్థల్లో డబ్బులు చెల్లించినప్పటికీ తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ కొందరు ఫిర్యాదు చేశారని తెలిపారు. అలాగే స్థిరాస్తి వ్యాపారంలో స్థలం లేదా నివాస సముదాయం కొనుగోలు చేసి మోసపోయామని మరో వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ విషయంపై సంబంధిత డీఎస్పీతో నేరుగా మాట్లాడి బాధితుడి ఫిర్యాదును స్వీకరించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు ఎమ్మెల్యే వివరించారు.పెన్షన్లు, వివిధ ప్రభుత్వ పథకాలు, ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తులు, ఇతర ప్రజా సమస్యలపై కూడా ప్రజలు కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను తెలియజేస్తున్నారని అన్నారు.



ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు ఒక వేదిక ఉండాలి. ప్రజలు చెప్పిన సమస్యకు పరిష్కారం చూపించే బాధ్యత ప్రజాప్రతినిధిగా తనపై ఉందని బోడే ప్రసాద్ స్పష్టం చేశారు.

# రూ.249.50 కోట్లతో 22 కీలక ప్రాజెక్టులు ప్రారంభం మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబరు 11:**
రాష్ట్రంలో వైద్య సేవలను బలోపేతం చేసేందుకు రూ.1,272 కోట్లతో ఆరోగ్య వసతుల పనులు చేపట్టామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శనివారం విజయవాడలో కేంద్ర మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రూ.249.50 కోట్లతో పూర్తయిన 22 కీలక ఆరోగ్య ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. వీటిలో 10 అత్యవసర చికిత్స కేంద్రాలు, 12 సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలలు ఉన్నాయని తెలిపారు.
డిసెంబరులో 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించి ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులను అనుసంధానం చేస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో 2,800 ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు. సెప్టెంబరు 17 నుంచి 'సేవా సంకల్ప్ అభియాన్'ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు



'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. రక్తదానం, ఆరోగ్యం, పరిశుభ్రత, సైబర్ మోసాలపై అవగాహన, అవయవదాన ప్రచారం తదితర 25 రకాల సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

# ప్రజా దర్బార్లో ప్రజల గోడు.. 22 అర్జీల వెల్లువ!

- ఇంటి స్థలాలు, ఇళ్ల నిర్మాణాలకే 16 వినతులు
- సీఎంఆర్ఎఫ్ సాయంతో పాటు ఇతర సమస్యలపై అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే కొండయ్య

**చీరాల, సెప్టెంబర్ 11,(పెన్ పవర్) :**
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమం శుక్రవారం చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ప్రజల నుంచి స్వయంగా వినతులు, అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా మొత్తం 22 అర్జీలు అందాయి. వీటిలో ఇంటి నిర్మాణాలు, ఇంటి స్థలాలకు



సంబంధించి 16, సీఎంఆర్ఎఫ్ సాయం కోసం 2, ఇతర సమస్యలపై 4 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.
కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కౌతరపు జనార్ధన్, కాళహస్తి బోర్డు సభ్యురాలు కుమ్మరి బోయిన రజిని, పట్టణ అధ్యక్షుడు దోగుపర్తి సురేష్, నియోజకవర్గ అధ్యక్షురాలు లలిత, కర్ణ శ్రీనివాసరావు, జెఎస్ పి నాయకుడు గూడూరు శివరాం ప్రసాద్, గ్లోబల్ ఎన్ఆర్ఐ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కల శివ నాగరాజు, నాగలక్ష్మి, పద్మిని, స్వాతి తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వినాయక మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు,పెన్ పవర్,సెప్టెంబర్ 11:**
వినాయక చవితి సందర్భంగా గుంటూరు జిల్లాలో విగ్రహాలు, మండపాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా సంబంధిత పోలీస్స్టేషన్ ఎస్హెచ్ఓ అనుమతి తీసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. సెప్టెంబర్ 14న వినాయక చవితి నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలని కోరారు.మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు కనీసం ఐదుగురు సభ్యులతో తమ వివరాలు, గుర్తింపు కార్డుల ప్రతులను పోలీసులకు అందించాలి. ప్రైవేటు లేదా ప్రభుత్వ స్థలాల్లో మండపాల ఏర్పాటుకు సంబంధిత యజమాని, పంచాయతీ లేదా మున్సిపల్ అధికారుల అనుమతి తీసుకోవాలి. విద్యుత్, అగ్నిమాపక శాఖల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.
మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, రాత్రివేళల్లో నిర్వాహకులు భద్రతా చర్యలు చేపట్టాలి. ట్రాఫిక్కు ఇబ్బంది కలగకుండా మండపాలు ఏర్పాటు చేయడంతో పాటు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే లౌడ్స్పీకర్లు



వినియోగించాలి. డీజేలు, మందుగుండు సామగ్రి, అసభ్య ప్రదర్శనలు, మద్యం వినియోగం పూర్తిగా నిషేధం.నిమజ్జన ఊరేగింపులో ఇతర మతాలు, కులాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయరాదని, పోలీసుల అనుమతించిన మార్గం, సమయం మాత్రమే పాటించాలని ఎస్పీ సూచించారు. చిన్నారులు, మైనర్లు, మద్యం సేవించిన వారిని నిమజ్జన వాహనాల్లో తీసుకెళ్లరాదని తెలిపారు. ట్రాఫిక్, భద్రత కోసం తగినంత మంది వాలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటన జరిగినా నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు.



# చిల్డ్రన్ పార్కుకు మహర్దశ..!

- రూ.50 లక్షలతో ఆధునిక సౌకర్యాల ఏర్పాటు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కొండయ్య -ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, చిన్నారుల ఆటస్థలం, లైటింగ్తో సరికొత్త రూపు ప్రజల ఆరోగ్యమే లక్ష్యమన్న ఎమ్మెల్యే



**చీరాల, సెప్టెంబర్ 11, (పెన్ పవర్)**
:చీరాల మున్సిపాలిటీ 8వ వార్డులోని డి.రామానాయుడు చిల్డ్రన్ పార్కు అభివృద్ధి పనులకు చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.50 లక్షల వ్యయంతో పార్కులో ఆధునిక సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నారు.పార్కులో నూతనంగా ఓపెన్ జిమ్ పరికరాలు, చిన్నారుల ఆట వస్తువులు, వాకింగ్ పాత్వే, లైటింగ్ సదుపాయాలను కల్పించనున్నారు. పిల్లలు, వృద్ధులు, స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలికి ఉపయోగపడేలా పార్కును అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.పచ్చదనంతో పాటు ఆధునిక సౌకర్యాలతో పార్కును తీర్చిదిద్దాలని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం పట్టణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రజల ఆరోగ్యం, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.పార్కు అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గడపకు సంక్షేమ పథకాలు

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు
- ఉమ్మడి కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూల స్పందన
- స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేస్తాం
- నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

**నరసరావుపేట,పెన్ పవర్ సెప్టెంబర్ 11:**
ఉమ్మడి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు నరసరావుపేట నియోజకవర్గంలో చేపట్టిన రెండేళ్ల నమ్మకంఅభివృద్ధిసంక్షేమం డోర్ టు డోర్ కార్యక్రమం శుక్రవారం 7వ వార్డులో కొనసాగింది. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఆయా పథకాల ద్వారా తమకు ప్రయోజనం అందుతోందా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నారని అన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పాటులో కార్యకర్తలతో పాటు మహిళలు, మైనారిటీ సోదరులు అందించిన సహకారం మరువలేనిదని అరవిందబాబు పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేస్తూ కష్టకాలంలో తనకు అండగా నిలిచిన మైనారిటీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యల్లో చిన్నచిన్న లోపాలు, సమస్యలు ఉంటే



వాటిని పరిష్కరించేందుకు స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొత్తగా పెన్షన్లకు అవకాశం కల్పించామని, అర్హులైన వారు ఎన్టీఆర్ భరోసా, దివ్యాంగుల, ఆరోగ్య సంబంధిత పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.రాష్ట్ర అభివృద్ధి, అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తి వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఎమ్మెల్యే తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్నినో ప్రభావం నేపథ్యంలో నీటి వినియోగంలో ప్రజలు, రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా నాగార్జునసాగర్ కుడికాలువ ఆయకట్టు పరిధిలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగులో సమయపాలన పాటించాలని రైతులకు సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకులను ఎన్నుకోవాలని ఎమ్మెల్యే కోరారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ షేక్ మీరావాలి, 7వ వార్డు ఇంచార్జ్ షేక్ నాగుర్, నాయకులు షేక్ నాగుర్ భాష, పి. రాయప్ప, షేక్ శుభాని, మాతంగి బంగారం, సయ్యద్ జానీ, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

